



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో ప్రమాదం

- శాస్త్రీయంగా రీసైక్లింగ్ చేయాలి
- కలెక్టర్ టిఎస్.చేతన్
- పుట్టపర్తిలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఇళ్లు, కార్యాలయాలు, వాణిజ్య, వ్యాపార సంస్థల్లో పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు ప్రజల ఆరోగ్యానికి చాలా ప్రమాదం అని, వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలియజేశారు. మూడో శనివారం సందర్భంగా జిల్లా పంచాయతీరాజ్, నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో ఇ-వ్యర్థాలపై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నుంచి ప్రారంభం అయిన ర్యాలీ వై.జంక్షన్ వరకు కొనసాగింది. విద్యార్థులు, మహిళలు, వివిధ శాఖల అధికారులు ఇందులో పాల్గొన్నారు. వై.జంక్షన్ వద్ద స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 2022 నాటికి 8 కోట్ల టన్నుల ఇ-వ్యర్థాలు ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్యసంస్థ తన నివేదికలో వెల్లడించిందన్నారు. ఇందులో 20 మిలియన్ టన్నులు మాత్రమే రీసైక్లింగ్ జరుగుతున్నట్టు పేర్కొందని తెలిపారు. మిగిలిన ఇ-వ్యర్థాలన్నీ అశాస్త్రీయ విధానంలోనే తొలగించడం జరుగుతోందని, ఇది మానవాళి మనుగడకే ప్రమాదకరమన్నారు. ప్రజలు వారి ఇళ్లలోని పాడైన ఎలక్ట్రానిక్ పరికరాలు, వ్యర్థాలను నగర పాలకసంస్థ ఏర్పాటు చేసిన ఇ-వ్యర్థాల సేకరణ కేంద్రంలో అందజేస్తే వాటిని సరైన రీతిలో రీసైక్లింగ్ చేసి ముప్పు లేకుండా తొలగించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉన్నత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

'ఉపాధి' పెండింగ్ బిల్లులు చెల్లించాలి

రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతు సంఘం బృందం కదిరి మండలంలోని కెఎన్.పాలెం, వై.కొత్తపల్లి, వరికిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా ఆ గ్రామాల ప్రజలు, రైతులు వివిధ సమస్యలను రైతుసంఘం బృందం దృష్టికి తెచ్చింది. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ రైతుసంఘం నాయకులు శనివారం నాడు ఎంపిడిఒను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వై.కొత్తపల్లిలో జనవరి నుండి ఇప్పటివరకు సుమారు 14 వారాలు ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. కదిరి, పుట్టపర్తి ప్రధాన రోడ్డు నుంచి వై.కొత్తపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు శిథిలావస్థలో ఉందని దాని స్థానంలో కొత్త రోడ్డు వేయాలన్నారు. కెఎన్.పాలెంలో సచివాలయం, రైతుభరోసా భవనాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వరికిరెడ్డి పల్లె గ్రామంలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాను ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిరంతరంగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, వి.శంకర్ రెడ్డి, కదిరి మండల నాయకులు బి.సుధాకర్ రెడ్డి, బాబ్జాన్, రామ్మోహన్ పాల్గొన్నారు.

మడకశిరలో మల్టీమోడ్ హ్యాండ్ గ్రానైడ్ పరిశ్రమ

- వెయ్యి ఎకరాలు కేటాయింపునకు ప్రభుత్వం అంగీకారం
- మొదటి దశలో 329 ఎకరాలు కేటాయింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మడకశిర పరిధిలో మల్టీమోడ్ హ్యాండ్ గ్రానైడ్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ఒక సంస్థకు ముందుకొచ్చింది. ఈ మేరకు ఆ సంస్థకు రెండు దశల్లో కలిపి వెయ్యి ఎకరాల భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మొదటి దశ కింద 329 ఎకరాల కేటాయిస్తూ ఉత్తర్వులను శనివారం నాడు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. దీంతో ఈ ప్రాంతంలో మందుగుండు తయారీ పరిశ్రమ ఈ ప్రాంతానికి రానుంది. యుద్ధాల సమయంలో డిఫెన్సీయు, అఫెన్సీయు రెండు విధానాలుగానూ ఈ గ్రానైడ్‌ను వినియోగించడం జరుగుతుంది.



రెండు దశల్లో వెయ్యి ఎకరాల కేటాయింపు

మల్టీమోడ్ హ్యాండ్ గ్రానైడ్ పరిశ్రమను మడకశిర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నారు. మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్ వైడ్ అనే సంస్థ ముందుకొచ్చింది. ఈ సంస్థ రూ.1197 కోట్ల వ్యయంతో మల్టీమోడ్ హ్యాండ్ గ్రానైడ్ ఉత్పత్తి పరిశ్రమను రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిఆర్‌డిఒ మల్టీమోడ్ హ్యాండ్ గ్రానైడ్‌ను డిఆర్‌డిఒ సంస్థ ఇది వరకు అభివృద్ధి చేసి ఉంది. దీని ఉత్పత్తి కోసమని మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్ వైడ్ అనే సంస్థ ముందుకొచ్చింది. రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వమిచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొంది. మొదటి దశ కింద 329 ఎకరాలు కేటాయించారు. ఈ దశ పూర్తయితే ఈ ప్రాంతంలో 570 మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు. అదే రకంగా రెండో దశ కింద 671 ఎకరాలను రాబోయే రోజుల్లో కేటాయించనున్నట్టు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగింది. దీని ద్వారా 300 మందికి ఉపాధి లభిస్తుందని ప్రకటించారు. మొత్తం 879 మందికి ఉపాధి లభించనుంది.

మీడియా రంగం నుంచి మందుగుండు సామగ్రి వైపు

మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్‌వైడ్ అనే సంస్థ ఇప్పటి వరకు డిజిటల్ మీడియా రంగంలోనూ, హ్యాండ్‌సెట్ టెలికం రంగంలోనూ ఉంటూ వచ్చింది. ఈ సంస్థ ఇప్పుడు మందుగుండు తయారీ రంగంలోకి ప్రవేశిస్తున్నట్టు దీని ద్వారా స్పష్టమవుతోంది. ఈ రంగంలో ఈ సంస్థ ఏ మేరకు అనుభవముందన్నది సర్వత్రా చర్చ నడుస్తోంది. ఏది ఏమైనా వెనుకబడిన మడకశిర ప్రాంతానికి ఒక పరిశ్రమ రానుంది.

1 నుంచి ఉచిత వేసవి బడి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని త్యాగరాజనగర్ మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో మే 1 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉచిత వేసవి బడి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.సాయికళ, కె.మాళప్ప దంపతులు శనివారం తెలిపారు. పట్టణంలోని దాతల సహకారంతో గత 27 సంవత్సరాల నుంచి వేసవి బడి నిర్వహిస్తున్నామన్నారు. కరాటే, కంప్యూటర్, యోగ, క్రీడలు, సంగీతం, నత్యాలు, చిత్ర లేఖనం, చక్కని దస్తూరి తదితర విద్యలలో విలువలతో కూడిన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. 6-14 సంవత్సరాలు చిన్నారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం పరచుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9441144630 సంప్రదించాలని వారు కోరారు.

రాజకీయ ఉనికి కోసమే వైసిపి శవ రాజకీయాలు

అభివృద్ధి పనులకు మంత్రి సవిత భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

రాజకీయ ఉనికి కోసమే వైసిపి శవరాజకీయాలు చేస్తోందని మంత్రి సవిత విమర్శించారు. మంత్రి శనివారం నగర పంచాయతీ పరిధిలోని చెరువు రోడ్డులో రూ. 15 లక్షలు, బిటిఆర్ కాలనీలో రూ. 15 లక్షలతో డ్రెయినేజీ కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి విలేకరు లతో మాట్లాడుతూ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. వైసిపి రాజకీయ ఉనికి కోసమే రాస్తారోకోలు, ధర్నాలు చేస్తుందని, ప్రజల సమస్యలపై కాదన్నారు. ప్రజాసమస్యలపై పోరాటం చేస్తే స్వాగతిస్తామన్నారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, కూటమి ప్రభుత్వంలో ఈ 10 నెలల్లో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. వై జంక్షన్ వద్ద ఆర్చ్ లైటింగ్ నగర పంచాయతీ పరిధిలో సెంట్రల్ లైటింగ్ పనులను త్వరలోనే చేపడతామన్నారు. కోనాపురం రోడ్డులో రూ. కోటితో బిటి రోడ్డు, రూ. 50 లక్షలతో డ్రెయినేజీ పనులు, రూ. 62 లక్షలతో అన్నా కాంటీన్ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. నారాయణమ్మ కాలనీ, బిటిఆర్ కాలనీ, దర్గాపేటల్లో డ్రెయినేజీల ఏర్పాటుకు రూ. 2.1 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఇంటింటికీ డస్ట్ బిన్‌లు పంపిణీ చేస్తామన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు ఇస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సతీష్‌కుమార్, తహశీల్దార్ శ్రీధర్, సిఐ రాఘవన్, విద్యుత్ శాఖ ఎడి రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, యువ నాయకులు బాబుల్‌రెడ్డి, కృష్ణమూర్తి, పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, మండల కన్వీనర్ సిద్దయ్య, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వెంకటగిరిపాలెం శ్రీనివాసులు, నారాయణస్వామి, అశ్వర్థనారాయణ, రామకృష్ణ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా పట్టణంలో చేపట్టిన పారిశుధ్య పనుల్లో మంత్రి సవిత పాల్గొన్నారు. విద్యార్థులు, అధికారులు, నాయకుల చేత మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. 'ఈ వేస్ట్'పై మంత్రి అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఇళ్లలోని ఈ వేస్ట్‌ను సచివాలయాల్లో అందజేస్తే, వాటిని రీసైకిల్ చేసి మళ్లీ ఉపయోగించే విధానాన్ని అమలు చేస్తారని తెలిపారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

నియోజకవర్గ వ్యాప్తంగా ఏ గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకూడదని మంత్రి సవిత ఆదేశించారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి నియోజకవర్గంలోని పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం, పరిగి, గోరంట్ల మండలాల్లో తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి నుంచే తాగునీటి సమస్యపై దృష్టి సారించాలన్నారు. అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. ఎక్కడ ఇబ్బంది ఉన్నా అధికారులు వెంటనే స్పందించాలన్నారు. ఆర్‌ఒ ప్లాంట్ వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. మోటార్లు చెడిపోతే 24 గంటల్లోపు మరమ్మతులు చేయించాలని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈఈ మల్లికార్జున, డీఈ శ్రీనివాసులు, మిత్ర ఓబులేష్, 5 మండలాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ చేతన్

22న 'పురం'లో మెగా జాబ్‌మేళా

పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 9 గంటలకు హిందూపురం శ్రీ బాలాజీ విద్యా విహార్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలెప్‌మెంట్ ఆఫీసర్ బండ్ల హరికష్ణ తెలిపారు. జాబ్‌మేళాలకు సంబంధించిన పోస్టర్లను శనివారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ టిఎస్.చేతన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్కిల్ డెవలెప్‌మెంట్ ఆఫీసర్ మాట్లాడుతూ దాదాపు 20 బహుళజాతి కంపెనీలతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటిఐ, డిప్లొమో, బీఫార్మసీ, నర్సింగ్, బీటెక్ తదితర కోర్సులు చదవిన వారందూ ఇంటర్వ్యూల్లో పాల్గొనవచ్చన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. జాబ్‌మేళాలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు నెలకు రూ.10 నుంచి రూ.40 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరు అయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలు తీసుకుని రావాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9976706976, 9966682246 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌కు సంబంధించి https:// naipunyam. ap.gov.in/user- registrationలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం



మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఛైర్మన్

హిందూపురం రోటరీ క్లబ్ వారి సేవలు అభినందనీయమని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో రోటరీ క్లబ్ సభ్యులు రూ.1లక్ష ఆర్థిక సహాయంతో చల్లటి శుద్ధ జలం అందించే కూలింగ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులుతో కలిసి రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయానికి వచ్చే వారి కోసం చల్లటి నీటిని అందించే కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగరాజ్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, శ్రీధర్ గౌడ్, ఆడిటర్ వరదరాజులు, కళ్యాణ్, ఓబుళకొండయ్య, గిరిధర్, వెంకటేష్ బాబు, మహిళా సభ్యులు విద్య, తులాజా బాయి, భువనేశ్వరి, టీడీపీ నాయకులు దుర్గా నవీన్, నజీర్, అమీన్, పాల్గొన్నారు.

దేశంలో ప్రజావ్యతిరేక పాలన

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కేంద్రంలో బీజేపీ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని, ఆ పార్టీ త్వరలో కనుమరుగవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ పుట్టపర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి దాడిరెడ్డి మధుసూదన్ రెడ్డి విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని తెచ్చి ముస్లిములకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో మతతత్వం బాగా పెరిగిందన్నారు. మతాల పరంగా ప్రజలను విడదీస్తూ ఓట్ల రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎస్‌పి మహేష్

పురంలో ఘనంగా రన్ ఫర్ జీసస్

ప్రజాశక్తి-హిందూపురం

రన్ ఫర్ జీసస్ ర్యాలీ కార్యక్రమాన్ని డీఎస్పీ మహేష్ జెండా ఊపి శనివారం ప్రారంభించారు. ఈ ర్యాలీని పట్టణంలోని ప్రధాన కూడళ్లలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్, సంఘం సెక్రెటరీ డాక్టర్ ఎ.నాగేంద్ర కుమార్, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ రాజగోపాల్ నాయుడు, టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం, సంఘ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ పి స్టీఫెన్ రాజ్, యుపిసిఎల్‌ఎ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ ఎస్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రభాకర్



అగ్ని ప్రమాదాలపై వివరిస్తున్న అగ్నిమాపక అధికారి

ప్రజాశక్తి-హిందూపురం

అగ్ని ప్రమాదాల నివారణలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రభాకర్ పేర్కొన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని జిల్లా స్థాయి ప్రభుత్వాసుపత్రిలో అగ్ని ప్రమాదాల నివారణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రయోగాత్మక అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, ఆర్‌ఎంఒ డాక్టర్ డేవిడ్ రాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఓబులమ్మ, చంద్రకళ, సుశీలమ్మ, సెక్యూరిటీ సూపర్ వైజర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయెద్దు : ఎమ్మెల్యే.

ప్రజాశక్తి-తనకల్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఎంపిడిఒ పూల రెడ్డప్పను ఆదేశించారు. మండలంలోని టి.సదుం గ్రామ ఎంపియుపి పాఠశాలలో శనివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముందుగా పాఠశాల ప్రహరీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే గ్రామానికి రోడ్డు సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో నిర్మించతలపెట్టిన నీటి తొట్టె నిర్మాణాన్ని ప్రారంభించారు. గ్రామానికి సంబంధించిన బోరు నుంచి ఒక నాయకుడు సొంత అవసరాలకు నీరు వాడుకుంటున్నారని, ఒక విఆర్‌ఒ పట్టాదారు పాసుపుస్తకం కోసం లంచం తీసుకున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌నాయుడు, ప్రవీణ్, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్, మురళిస్వామి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై 21న చలో విజయవాడ

ప్రజాశక్తి-హిందూపురం



సిడిపిఒ శాంతకు వినతిని ఇస్తున్న అంగన్‌వాడీలు

అంగన్వాడీ మినీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 21న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి, విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద మహాధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, అంగన్వాడీలు పేర్కొన్నారు. శనివారం సిఐటియు నాయకులతో కలిసి అంగన్వాడీ మిని వర్కర్లు సిడిపిఒ శాంతకు ఈ విషయంపై వినతిని ఇచ్చి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రాము, అంగన్వాడీ హిందూపురం ప్రాజెక్ట్ కార్యదర్శి శోభమ్మలు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారుగా 6830 మెయిన్ సెంటర్లు. మినీ సెంటర్లుగా నడుస్తున్నాయి. తక్కువ జనాభా ఉన్న ప్రాంతంలో మాత్రమే మినీ సెంటర్లు నడవాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో 1000 నుంచి 1200 మంది జనాభా ఉన్నచోట కూడా మినీ సెంటర్లు నడుస్తున్నాయి. మినీ వర్కర్ల పని హెల్పర్లు పని కూడా వారే చేస్తున్నారు. 42 రోజుల సమ్మె సందర్భంగా. మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని చేసిన పోరాటం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అసెంబ్లీలో మంత్రులు మినీ సెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని ప్రకటనలు చేసిన ఇంత వరకు జీవో రాలేదు అన్నారు. మినీ వర్కర్లు మారుమూల గ్రామాల్లో పేద గర్భిణీలకు, బాలింతలకు, చిన్న పిల్లలకు ఆహారం వండి పెడుతూ, ఆరోగ్యం, ప్రీ స్కూల్స్ అందిస్తున్నారు. మినీ వర్కర్‌లు హెల్పర్ పని చేయడం వల్ల పని భారం పెరిగింది అన్నారు. ప్రీ స్కూల్ నడపడం, రికార్డుల రాయడం, ఆన్ లైన్ వర్క్ వంటి అనేక పనులు చేస్తున్నారు. కానీ మినీ వర్కర్ల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదు అన్నారు. వీరికి వేసవి సెలవులు, ఉద్యోగోన్నతులు ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ, సెక్టర్ లీడర్స్ విజయలక్ష్మి, శైలమ్మ, విజయ, లలిత, నాగమణి పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ప్రశాంత జీవనం గడపాలి

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జడ్జి

వృద్ధాప్యంలో ఎలాంటి మానసిక ఆందోళనలకు గురికాకుండా ప్రశాంత జీవనం గడపాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం పట్టణ పరిధిలోని కొట్నూరు వద్ద ఉన్న నిర్మల వద్ధాశ్రమం, శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న వెంకటేశ్వర వద్ధాశ్రమం, పరిగి మండల పరిధిలోని ప్రశాంతి నిలయంలో న్యాయ విజ్ఞాన సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మనిషి జీవితంలో వద్ధాప్యం చాలా విలువైందన్నారు. ప్రశాంత జీవనం గడిపేందుకు ఈ దశ దోహదపడుతుందని తెలిపారు. అన్ని అర్హతలు ఉండి, సరైన రికార్డులు ఉన్న వారికి పింఛన్లు అందకపోతే వివరాలను తెలియజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వన్‌టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు మాట్లాడుతూ వద్ధాప్యంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. వద్ధాశ్రమంలో వద్ధుల కోసం అవసరమైన చర్యలు తీసుకునేందుకు తన వంతు కషి చేస్తానని సిఐ తెలిపారు. ఆయా వద్ధాశ్రమంలో అదనపు జిల్లా జడ్జి సొంత నిధులతో వద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాది సంతోషి కుమారి, ఆయా వద్ధాశ్రమాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సిహెచ్‌ఒల నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్



డిఎంహెచ్‌ఒ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద పని చేస్తున్న సిహెచ్‌ఒల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని శనివారం ఎపి ఎంసిఎ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కార్తీక్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ నందీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రెండేళ్లుగా వేతనాలు సక్రమంగా అందడం లేదని,ఆరేళ్లు దాటిన సిహెచ్‌ఒ లను క్రమబద్ధీకరించాలని, 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెలా శాలరీతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ఏటా 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, తదితర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అనంతరం డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఫిరోజ్‌బేగంకు వినతిపత్రం అందజేశారు. తమ డిమాండ్లను తీర్చేంత వరకూ శాంతియుతంగా నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, నందీశ్వర్, చందన, వేణుగోపాల్, సిహెచ్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.



జడ్జి గీతావాణిని సత్కరిస్తున్న సిబ్బంది

జడ్జి గీతావాణికి ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణ కోర్టులోని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి బదిలీ అయిన సందర్భంగా శనివారం బార్ అసోసియేషన్, సీనియర్, జూనియర్ న్యాయవాదుల ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, న్యాయవాదులు మాట్లాడుతూ జడ్జి సేవలను కొనియాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని, ఆ బదిలీ సందర్భంలో గతంలో చేసిన సేవలు గుర్తిండిపోతాయన్నారు. అనంతరం మహిళా న్యాయవాదులు గీతవాణిను ఘనంగా సత్కరించారు. జడ్జి గీతావాణి మాట్లాడుతూ విధులు నిర్వహణలో న్యాయవాదులు, సిబ్బంది సహాయ సహకారాలు అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్య సాయి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కరీం, జనరల్ సెక్రటరీ డిఎల్ఎన్.మూర్తి, ఉపాధ్యక్షులు నూర్‌మహమ్మద్, సహకార్యదర్శి బాలసుందరి, కోశాధికారి అబ్దుల్లా, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

భారత రాజ్యాంగానికి విరుద్ధంగా, లౌకిక రాజ్య ఆశయానికి తూట్లు పొడుస్తూ ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ-2025ను తక్షణమే రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ముస్లింలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 7వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని శనివారం సిపిఐ నాయకులు సందర్శించి ముస్లింలకు సంఘీభావం తెలిపారు. రవికుమార్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలే కానీ కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. ముస్లింలకు న్యాయం జరిగేంత వరకూ వారికి అండగా ఉంటామన్నారు. దీక్షా శిబిరంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడగ వెంకటనారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గుర్రం వెంకటస్వామి, ఆదినారాయణ, మహిళా సమాఖ్య లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, గోవిందరాజులు, లక్ష్మీనారాయణ, ఆర్గనైజేషన్ కార్యదర్శి ఆంజనేయులు, తాజుద్దీన్, రామకృష్ణ, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ గదులకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

షాపింగ్ గదులకు వేలం

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచి రాధ అధ్యక్షతన షాపింగ్ గదులకు వేలం పాటలు నిర్వహించారు. మొత్తం 49 రూములు ఉండగా 25 రూములకు వేలం పాటలు నిర్వహించారు. మిగిలిన 24 రూములకు దుకాణాదారులు బకాయిలు చెల్లించనందున బకాయిలు చెల్లించిన వెంటనే ఈ రూములకు కూడా వేలం నిర్వహిస్తామని ఎంపిడిఒ నటరాజు తెలిపారు. 25 గదులకు నెలకు రూ. 3,51,200 ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో అతి ఎక్కువగా 19వ దుకాణాన్ని ఆవుల అశోక్ రూ. 42,600కు దక్కించుకున్నారు. అతి తక్కువగా 16వ రూమును శ్రీనివాసులు రూ. 4,600 దక్కించుకున్నారు. వేలంలో దక్కించుకున్న వారు ప్రతి నెలా అద్దెలు సక్రమంగా కట్టి పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటు అందివ్వాలన్నారు. దుకాణాల ముందు చిరు వ్యాపార అంగళ్లు నిర్వహించకూడదన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి

రొద్దం : మండలంలోని దొడగట్ట పంచాయతీలో శనివారం అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ అంబేద్కర్ జయంతి రోజున దొడగట్ట గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు పరిగి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ రోజు అంబేద్కర్ జయంతి నిర్వహించలేదు. దీంతో శనివారం మహిళలు జ్యోతులు ఎత్తుకొని, అంబేద్కర్ చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేసి అంబేద్కర్ సేవలను కొనియాడారు. కార్యక్ర మంలో జయప్ప, మూర్తి, గోపాల్, దుర్గప్ప, గోనిమేకలపల్లి గోపాల్, తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా చూడండి

ప్రజాశక్తి-బత్తలపల్లి

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా చూడాలని సిడిపిఒ సరస్వతి పిల్లల తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని ముష్టూరు గ్రామ అంగన్వాడీ-1 కేంద్రంలో శనివారం సూపర్వైజర్ దేవమణి అధ్యక్షతన పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఒ మాట్లాడుతూ చిన్నారుల్లో వచ్చే పోషకాహార లోపాన్ని గుర్తించి తగిన ఆహారం అందించాలన్నారు. పోషకాహార పద్ధతులు, తదితర విషయాలను వివరిం చారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జార్జిరెడ్డికి నివాళి

కొత్తచెరువు రూరల్ : మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడడమే జార్జిరెడ్డికి మనమిచ్చే నిజమైన నివాళి అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పవన్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. వారు ముందుగా జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జార్జిరెడ్డి సమాజానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.

'పదో తరగతి ఫలితాలే జీవితం కాదు'

రొద్దం : కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్స్ చేత సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్.మరవపల్లి కెజిబివిలో శనివారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలవుతున్న సందర్భంలో విద్యార్థుల్లో అనవసర భయాందోళనలు తగ్గించి, ధైర్యం నింపడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'పదో తరగతి ఫలితాలే జీవితం కాదు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ రామకష్ణ మాట్లాడుతూ పరీక్షలు, ఫలితాలు అనేవి మన ప్రయాణంలో ఒక దశ మాత్రమే, అంతిమ గమ్యం కాదన్నారు. మీ ముందు ఉన్న ప్రపంచం ఎంతో పెద్దది.. ఆ ప్రపంచాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నాగరత్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



కెజిబివిలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ రామకృష్ణ

రుణపాశాలు..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రైతులు, చేనేత కార్మికులు, సామాన్య వ్యాపారులు ఇలా అన్ని తరగతుల వాళ్లు రుణ భారాలు అధికమవుతున్నాయి. ఈ భారాల నుంచి బయటపడలేమన్న భయంతో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఈ వారంలో పెద్దఎత్తున రైతు ఆత్మహత్యలు చోటు చేసుకున్నాయి. పెట్టిన పంటలకు పెట్టుబడులు కూడా రాలేదని రుణభారం రైతులు ఆత్మహత్యలు వరుసగా చోటు చేసుకున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు కూడా వారిని దెబ్బ తీశాయి. గాలివాన బీభత్సానికి పంటలు దెబ్బతిని అరటి రైతు యల్లనూరు మండలంలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంకోవైపు నార్పలలో మామిడి పంట కొనుగోలు చేసిండి గాలివానకు దెబ్బతినడంతో వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరంలో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా వరుసగా ఈ వారంలో పెద్దఎత్తున ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రుణభారాలు పెరిగిపోతుండటంతోనే ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఈ రుణభారాలు ఒక్క రైతులు, చేనేత కార్మికులకే కాకుండా మధ్యతరగతి ప్రజలకు కూడా వెంటాడుతున్నాయని ఇటీవల వెలువడిన నివేదికలు చెబుతున్నాయి. ఇక ఈ వారంలో వాతావరణంలోనూ అనూహ్యమైన మార్పులుంటున్నాయి. ఒకవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు గాలి వానలు వీడటం లేదు. వరుసగా వీస్తుండటంతో పంటలు దెబ్బతింటున్నాయి. అరటి, మామిడి పంటలతోపాటు, మొక్కజొన్న పంటలు తీవ్రంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఈ వాతావరణం చూసి రైతుల్లో గుబులు నెలకొంది. ఇదే అదునుగా పంటలకు సరైన ధరను కల్పించకుండా తక్కువకనే కొనుగోలు చేస్తున్నారు. గాలివానకు పంటలు ఎప్పుడు పడిపోతాయోనని గుబులు రైతుల్లో నెలకొంది. దీంతో ఉన్న కాడికి అమ్ముకునేందుకు రైతులు పోటీపడుతుండటంతో ధరను తగ్గించి వ్యాపారులు అమ్మేసుకుంటున్నారు. అరటి ధర టన్ను రూ.11 వేలు లోపే ఉంది. బత్తాయిన క్వింటాళు రూ.22 వేలు వరకే ధర ఉంటోంది. మామిడి ధరలు కూడా పడిపోతున్నాయి. ఇలా ప్రతి పంటకూ ధరలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ వారంలో మంత్రుల పర్యటనల సాగాయి. సత్యసాయి జిల్లాలో మడకశిర నియోజకవర్గంలో ఒకేసారి నలుగురు మంత్రులు పర్యటించారు. ఇక అనంతపురం జిల్లాలో ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్ పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా శింగనమల నియోజకవర్గంకు సంబంధించి టిడిపి నేతల మధ్య విభేదాలు వెలుగు చూశాయి. పరస్పరం ఘర్షణకు దిగారు. ఇక కూటమి నేతల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. సాధారణంగా సోదరుల మధ్యనున్న భేదాలేనని ఇన్‌ఛార్జి మంత్రి భరత్ చెప్పారు. అయితే ఇవి రాబోయే రోజుల్లో ఏ రకంగా సర్దుబాటు అవుతాయో చూడాల్సి ఉంది.



ఎక్సైజ్ పోలీసుల విస్తృత దాడులు

కర్నాటక మద్యం, ద్విచక్ర వాహనం స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం

డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య సూచనలు శనివారం హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. ఇందులో ముగ్గురిపై కేసు నమోదు చేయడంతో పాటు ఒక ద్విచక్ర వాహనం, కర్నాటక మద్యాన్ని సీజ్ చేశారు. ఈ విషయంపై స్థానిక స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎక్సైజ్ సిఐ లక్ష్మి దుర్గయ్య వివరాలను వెల్లడించారు. కర్నాటక మద్యం విక్రయిస్తున్నారన్న పక్క సమాచారంతో చిలమత్తూరు మండలం మోరసాలపల్లిలో విస్తృత దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో రామాంజిని అదపులోకి తీసుకుని, ఇతని వద్ద ఉన్న మద్యం సీజ్ చేశామన్నారు. హిందూపురం పట్టణంలోని నేతాజీ నగర్‌లో కర్నాటక మద్యం విక్రయిస్తున్న మంజుళను అదపులోకి తీసుకుని మద్యం స్వాదీనం చేసుకున్నామన్నారు. పరిగి మండలం ధనాపురం క్రాస్ వద్ద ద్విచక్ర వాహనంలో కర్నాటక మద్యం తీసుకొస్తున్న సోమందేపల్లి మండలం మండ్లీకి చెందిన మారుతిని అరెస్టు చేసి మద్యంతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు. మొత్తం 205 హైవర్డ్స్ విస్కీ టెట్రా ప్యాకెట్స్‌ను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు మీద మూడు కేసులు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఫరూక్, నారాయణ స్వామి, హెడ్ కానిస్టేబుల్స్ నరసింహ, వెంకటేష్, సతీష్, కానిస్టేబుల్స్ అంజి, సురేష్, కుమార్, రంగదామ, శివ, సుధాకర్ రెడ్డి, ఉస్మాన్ విశాలాక్షి పాల్గొనట్లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యం, ద్విచక్ర వాహనాన్ని చూపిస్తున్న పోలీసులు

హంద్రీనీవా కాలువ పరిశీలన

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలో వెళ్తున్న హంద్రీనీవా కాలువను శనివారం జలసాధన సమితి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కాశీం, హనుమంతరెడ్డి, జయరామిరెడ్డి, తదితరులు పరిశీలించారు. వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ బలహీనంగా ఉండటం వల్ల పదే పదే తెగిపోతుందన్నారు. హంద్రీనీవా కాలువ కంపచెట్లతో నిండిపోయి, గండ్లు పడ్డాయని మరమ్మతులు చేయాలని జలసాధన సమితి ఆధ్వర్యంలో గత సెప్టెంబర్‌లోనే జనవరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి సవిత, ఎమ్మెల్యేలు బాలకృష్ణ, ఎంఎస్.రాజు దృష్టికి తీసుకెళ్లినా వారెవరూ తగిన చర్యలు తీసుకోలేదన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా 265 చెరువులకు నీళ్లు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 26 చెరువులకు మాత్రమే ఇచ్చారన్నారు. వారం పది రోజుల్లో మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు నిలిపివేస్తామని హంద్రీ నీవా అధికారులు చెబుతున్నారు. నీళ్లు ఉండి కూడా మడకశిర ప్రాంతానికి నీళ్లు ఇవ్వలేని పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.



హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తున్న జలసాధన సమితి నాయకులు



మెడల్స్ సాధించి కాకతీయ విద్యానికేతన్ విద్యార్థులు

ప్రతిభావంత విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నీట్, ఒలింపియాడ్ ఫౌండేషన్ కోర్సుల్లో పాఠశాల స్థాయిలో రాణించిన విద్యార్థులకు శనివారం పట్టణంలోని కాకతీయ విద్యా నికేతన్ లో కరస్పాండెంట్ నిర్మలాదేవి మెడల్స్, ప్రశంసాపత్రాలు అంద జేశారు. 6, 7, 8, 9 తరగతుల్లో ప్రతిభ కనబరిచిన కె.యశ్విత, కె.మౌనిక, డి.సంధ్య, వి.సాయిగౌరి, కె.లాస్య, ఎస్.విద్య జాస్మిన్, కె.జోష్నప్రియ, సి.అరవింద్, ఎస్.గణేష్, ఎన్.నితీష్, వై.గిరిధర్, పి.తేజోదీప్‌లను కరెస్పాండెంట్ నిర్మలాదేవి అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఈ ఫౌండేషన్ కోర్సులు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయ బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

21 నుంచి విగ్రహ ప్రతిష్టాపన పూజలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని ఈదులముష్టూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ మూడు రోజుల పాటు సీతారామ, లక్ష్మణ, హనుమ, వినాయక, గరుడ సమేత మూల విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు, కార్య నిర్వాహకులు తెలిపారు. భక్తులు విగ్రహ ప్రతిష్టాపన పూజల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పద్యనాటక ఏకపాత్రాభినయ పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి-బత్తలపల్లి

తేనె తెలుగు కల్చరల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పద్య నాటక ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.అంజనప్ప, తేనె తెలుగు ఛానల్ డైరెక్టర్ పెద్దరికం సాయి తెలిపారు. వారు శనివారం బత్తలపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఎపి, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో నిర్వహించే పోటీల్లో ఆయా రాష్ట్రాల తెలుగు పద్య నాటక నటీనటులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. 25-55 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. 6 నిమిషాలకు మించకుండా డైలాగులతో కూడిన 2 పద్యాలను ఏకపాత్రాభినయం(మేకప్ లేకుండా) చేసి తాజా వీడియోను 9949997672 నెంబరుకు వాట్సప్, టెలిగ్రామ్ ద్వారా ఈ నెల 25వ తేదీ లోపు పంపాలన్నారు. ప్రాథమిక పరిశీలన అనంతరం 15 మంది కళాకారులను ఎంపిక చేస్తామన్నారు. ఆ తర్వాత పోటీలు నిర్వహించి కళారంగంలో నిష్ణాతులైన(న్యాయ) నిర్ణేతలచే విజేతలను ఎంపిక చేస్తామన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కదిరి టౌన్

అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదం సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఎలా నివారించాలో, సురక్షితంగా ఉండాలో డెమో సిలిండర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ శ్రీధర్ పాల్గొన్నారు.

వివాహానికి బియ్యం బస్తాలు అందజేత

ప్రజాశక్తి-పరిగి

స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన పారిశుధ్య కార్మికురాలు ధనలక్ష్మమ్మ కుమారుని వివాహం ఆదివారం జరగనుంది. దీంతో ఆమె ఆర్థిక సాయం అందించాలని దివ్య ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత పరిగి వేణుగోపాలరావును కోరింది. స్పందించిన ఆయన వివాహానికి అవసరమైన 3 బియ్యం బస్తాలను మేనేజర్ శివ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు గంగాధరప్పకు అందజేశారు. కార్యక్రమంలో మూర్తి, కొండూరు శివ, ఎస్ఎన్.మూర్తి, నాగరాజు, దిలీప్ పాల్గొన్నారు.

అంగన్వాడీ పిల్లలకు ఆట వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని ఆమిదాలగొంది అంగన్వాడీ కేంద్రంలో శనివారం సిడిపిఒ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో పిల్లలకు ఆట వస్తువులు పంపిణి చేశారు. అలాగే సిడిపిఒ నాగమల్లేశ్వరి, సూపర్‌వైజర్ శంకరమ్మ ఆధ్వర్యంలో పలు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. అనంతరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డు అందుకున్న అంగన్వాడీ కార్యకర్త విజయమ్మను నాయకులు గిరి, నాగేంద్ర, బాలాజీ తదితరులు శాలువాతో సత్కరించారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని వాసవీ ఫంక్షన్ హాలులో శనివారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బలరామ్ గుప్తా ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా రెడ్ క్రాస్ ఛైర్మన్ జిఎం.శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శేఖర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడాలని కోరారు. శిబిరంలో యువకులు పెద్దఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. శిబిరంలో రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ సెక్రటరీ విశ్వనాథ్, ప్రిన్సిపల్ భక్తవత్సలం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న బలరామ్‌గుప్తా

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-కదిరి టౌన్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా విద్యార్థినులు చేపట్టిన ర్యాలీని శనివారం ఎమ్మెల్యే పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ కూడలి వరకూ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. సిఎం చంద్రబాబు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సాకారం కోసం విశేష కృషి చేస్తున్నారని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో వీవీఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఎంఇఒ చెన్నకృష్ణ, ఎంపిడిఒ పోలప్ప, టిడిపి నాయకులు పివి.పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రొద్దంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ర్యాలీ చేపట్టిన విద్యార్థులు

పుట్టపర్తి రూరల్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ వి.రత్న 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఆవరణలోనూ పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏవో సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐలు మహేష్, వలి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, డిటిఆర్‌బి సిఐ సతీష్, ఎస్‌మి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఎస్ఐలు వీరన్న, ప్రదీప్‌సింగ్, ఎఎస్ఐ శ్రీరాములు, ఎఆర్, డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల, సచివాలయాలు, పాఠశాలల్లో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, సచివాలయ సిబ్బంది 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' నినాదాలు చేస్తూ ఆర్.మరవపల్లి గ్రామంలో పురవీధుల గుండా పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డి గోవిందప్ప, సచివాలయ, గ్రామపంచాయతీ సిబ్బంది, ఎంజెపి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ : స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ, వాటిని పారబోయు విధానంపై ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ జయప్ప ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాలను ఎలా డిస్పోస్ చేయాలో వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు డా. ప్రతాప్, కాంతారావు ఐక్యుఎసి కోఆర్డినేటర్ డా. యశోద రాణి, తెలుగు అధ్యాపకులు రామన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



కదిరిలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శుభ్రం చేస్తున్న ఎస్పీ

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని జి.గుడ్డంపల్లికి చెందిన సుబ్బరాయప్ప హత్య కేసులో నిందితుడు నంజేగౌడ్‌ను అరెస్టు చేసినట్లు సిఐ ఆంజనేయులు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ వివరాలను తెలియజేశారు. జి.గుడ్డంపల్లికి గ్రామానికి చెందిన నంజేగౌడ్ భార్యకు అదే గ్రామానికి చెందిన సుబ్బరాయప్ప ఇతరులతో అక్రమ సంబంధం ఉందని పేర్కొన్నాడు. ఈ క్రమంలో గత రెండేళ్లుగా నంజేగౌడ్ మద్యం సేవించి భార్యను వేధించడంతో పాటు చిత్రహింసలకు గురి చేసేవాడు. దీన్ని భరించలేక ఆమె బెంగళూరుకు వెళ్లిపోయింది. అప్పటి నుండి నంజే గౌడ్ బాగోగులు చూసేవారు ఎవరూ లేకపోయారు. ఈ నేపథ్యంలో నంజేగౌడ్ మద్యం తాగి సుబ్బరాయప్ప ఇంటి దగ్గరికి వెళ్లి తరుచూ ఘర్షణ పడేవాడు. అదే విషయం మనసులో పెట్టుకున్న నంజేగౌడ్ ఈ నెల 15 వ తేదీ మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో సుబ్బరాయప్ప ఇంటి దగ్గరకు వెళ్లి అతనితో ఘర్షణ పడ్డాడు. సుబ్బరాయప్ప, నంజేగౌడ్ ఇద్దరూ ఒకరిని ఒకరు దూషించుకున్నారు. ఈ నేపథ్యంలో నంజేగౌడ్ కోపంతో అక్కడే ఉన్న ఇటుక పెళ్ల తీసుకుని తన టవల్‌లో చుట్టి సుబ్బరాయప్ప తలపై బలంగా కొట్టాడు. సుబ్బరాయప్ప తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు సుబ్బరాయప్పను చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి అతను మరణించాడు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు నిందితుడు నంజేగౌడ్‌ను గోళ్ళాపురం పారిశ్రామిక వాడ సమీపంలోని రంగనాథ స్వామి దేవాలయం వద్ద శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రయివేట్ ఫైనాన్స్ ప్రతినిధిపై కొడవలితో దాడి

ప్రజాశక్తి-పరిగి

స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధి బాలాజీపై శనివారం కొడిగెనహళ్లి గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని గోవిందరాజులు కొడవలితో దాడి చేసిన సంఘటన మండల వ్యాప్తంగా కలకలం రేపింది. వివరాలు.. పరిగి గ్రామానికి చెందిన బాలాజీ హిందూపురంలోని బజాజ్ ఫైనాన్స్ కంపెనీలో ఏడాదిగా పని చేస్తున్నాడు. ఓ ఫైనాన్స్ విషయంలో కొడిగెనహళ్లికి చెందిన అవెంజర్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ యజమాని గోవిందరాజులుకు రూ. 40 వేల వరకూ ఫైనాన్స్ సమకూర్చారు. అది ముగింపునకు రావడంతో సెటిల్మెంట్ విషయంలో ఇద్దరి మధ్య చిన్న వివాదం జరిగింది. ఇది మనసులో పెట్టుకున్న గోవిందరాజులు శనివారం బాలాజీని వెంబడించి వెంట తెచ్చుకున్న కొడవలితో విచక్షణవంతంగా దాడి చేశారు. గమనించిన స్థానికులు బాలాజీని 108 ద్వారా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని గోవిందరాజులును అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. గోవింద రాజులుపై గతంలో అనేక కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. అతడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలాజీ

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-చిలమత్తూరు

అనారోగ్య సమస్యలతో విసిగి పోయిన ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం మండలంలోని వడ్డీ చెన్నంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు.. వడ్డీ చెన్నంపల్లి గ్రామానికి చెందిన పవిత్ర(24) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవితం పట్ల నైరాశ్యానికి గురైనట్లు తెలుస్తోంది. ఆమె శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు చిన్న కుమార్తె ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న పవిత్ర



పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

23న సిపిఎం పాదయాత్ర

కొత్తచెరువు : మండలంలోని ఇరగంపల్లి గ్రామంలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ ఈ నెల 23వ తేదీ సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి తశీల్దార్ కార్యాలయం వరకూ పాదయాత్ర చేపడుతున్నట్లు సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి అంజి, మండల కార్యదర్శి ముత్యాలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఇరగంపల్లి గ్రామంలో పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 400 కుటుంబాలకు పైగా ఉన్నాయని, శ్మశానవాటిక లేక శవాలను పూడ్చడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం రెండెకరాల స్థలం కేటాయించాలన్నారు. గ్రామాల్లో భూములు లేని రైతులకు భూములు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాషా, రాము, చింతలప్ప, పోతులయ్య, నరేష్, శివశంకర్, అఖిల్, వెంకటరాముడు, లక్ష్మయ్య, బొగ్గు ఆంజనేయులు, పాల్గొన్నారు.

ఎపి రైతుసంఘంలో చేరిక

నంబులపూలకుంట : మండలంలోని జోకల గ్రామానికి చెందిన బెల్లాల సోమిరెడ్డి శనివారం మండల రైతు సంఘంలో చేరినట్లు రైతు సంఘం మండల అధ్యక్షులు నాగిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమిరెడ్డి గతంలో తెలంగాణలో సిపిఎంలో పని చేసే వారని ప్రస్తుతం స్వగ్రామానికి చేరుకొని నివాసం ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో గంగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సిఐటియు నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆర్డీవో మహేష్ ఓటరు జాబితాపై రాజకీ య ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించా రు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, ఇతర సమస్యలపై చర్చించారు. ఆర్డీవో మాట్లాడు తూ అందరి సలహాలు, సూచనల మేరకు సవరణలు చేసి తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేస్తామన్నారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేస్తే తప్పక న్యాయం చేస్తామని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ఏఈఆర్వోలు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు, ఎన్నికల సీనియర్ సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.